## యూరియా కోసం ఇక్కట్లు

దుర్శేడ్‌లో యూరియా కోసం రైతుల క్యూలైన్



కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 11 : కరీంనగర్, దుర్శేడ్ ప్రాథమిక సహకార సంఘాలకు ఇండెంట్ ప్రకారం యూరియా స్టాక్ పంపించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. చెర్లభూత్కూర్, బొమ్మకల్ గ్రామాల్లోని విక్రయ కేంద్రాలకు మంగళవారం 20 టన్నుల యూరియా స్టాక్ వచ్చింది. దీంతో ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున మాత్రమే విక్రయించగా రెండు గంటల వ్యవధిలోనే స్టాక్ ఖాళీ అయింది. స్టాక్ పరిశీలనకు వచ్చిన ఏవో సత్యం మంగళవారం సాయంత్రం వరకు మరో 20 టన్నులు వస్తుందని తెలిపారు. అయితే, నిత్యం సహకార సంఘల వద్ద రోజూ పనులు విడిచి, రెండు బస్తాల కోసం క్యూలో నిలబడాల్సి వస్తుందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 33 మంది నామినేషన్ల తిరస్కరణ

- పట్టభద్రుల స్థానంలో 32 మంది..
- ఉపాధ్యాయ స్థానంలో ఒకరు..

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 11 : కరీంనగర్– మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 33 మంది నామినేషన్లు తిరస్కరించారు. మొత్తం ఈ రెండు స్థానాలకు 117 మంది నామినేషన్లు దాఖలు చేయగా, మంగళవారం పరిశీలన ప్రక్రియ చేపట్టారు. పట్టభద్రుల స్థానానికి 100 మందికి 32 మందిని, ఉపాధ్యాయ స్థానానికి 17 మందికి ఒకరిని తిరస్కరించారు. గ్రాడ్యుయేట్ స్థానంలో 68 మంది, టీచర్ స్థానంలో 16 మంది నామినేషన్లు అంగీకరించినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి తెలిపారు. నిబంధనల మేరకే నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేపట్టామని వెల్లడించారు. అనంతరం అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, తిరస్కరణకు గల కారణాలు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సంజయ్‌రామన్, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేశ్, ఏవో గడ్డం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# బేరసారాలు.. రాజీయత్నాలు?



- ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ల ప్రక్రియ
- ఈ సారి పెద్ద సంఖ్యలో దాఖలు
- కొంత మందిని విత్‌డ్రా చేయించేందుకు పలువురు అభ్యర్థుల ప్రయత్నాలు
- నేటి నుంచి రేపటి వరకు విత్‌డ్రాకు అవకాశం
- 2019తో పోలిస్తే ఈ సారి భారీగా పెరిగిన ఓటర్లు
- 1.58లక్షలకుపైగా గ్రాడ్యుయేట్ ఓటర్లు.. 3,874 మంది టీచర్స్ ఓటర్లు
- రసవత్తరంగా మారిన మండలి ఎన్నికలు
- కీలకం కానున్న కరీంనగర్ జిల్లా

**కరీంనగర్– మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటాపోటీ ఉండే అవకాశం కనిపిస్తున్నది. నామినేషన్ల ఘట్టం సోమవారమే ముగియగా, ఈసారి అధిక సంఖ్యలో దాఖలు కావడం బరిలో నిలిచే అభ్యర్థులకు ఒక సవాల్‌గా మారింది. దాంతో నామినేషన్ వేసిన వారిలో కొంతమందిని విత్‌డ్రా చేయించి, తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు తెలుస్తున్నది. రేపటి వరకు విత్‌డ్రా చేసుకునే అవకాశముండగా, ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నా.. ఈ సారి భారీగా పెరిగిన ఓటర్ల సంఖ్య అలజడి రేపుతున్నది. 2019 ఎన్నికలతో పోలిస్తే 1.58 లక్షల పైచిలుకు గ్రాడ్యుయేట్ ఓటర్లు, 3,874 మంది ఉపాధ్యాయ ఓటర్లు పెరగడం కలవరపెడుతున్నది. మొత్తంగా ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా ఉండే పరిస్థితులు కనిపిస్తుండగా.. అందులో బుజ్జగింపులు, సంప్రదింపుల తర్వాత చివరికి ఎంత మంది బరిలో ఉంటారన్నది రేపటి సాయంత్రం వరకు వెల్లడి కానున్నది. మరోవైపు నామినేషన్లకు ముందే ఎవరికి వారు ఓటర్ల మెప్పు పొందేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేయగా.. ఇప్పుడు నామినేషన్ల జాతర ముగియడంతో అందరి దృష్టి ప్రచారంపై నెలకొన్నది.**

కరీంనగర్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణప్రతినిధి) : కరీంనగర్– మెదక్ –నిజామాబాద్– ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల నామినేషన్ల ఘట్టం సోమవారంతో ముగిసింది. ఈ సారి నామినేషన్ల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి వంద మంది అభ్యర్థులు 192 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, అంచనాలకు మించి దాఖలయ్యాయన్న చర్చ ప్రస్తుతం అభ్యర్థుల్లో నడుస్తున్నది. అలాగే టీచర్ ఎమ్మెల్సీకి 17 మంది 32 సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఉపాధ్యాయ ఎమ్మెల్సీతో పోలిస్తే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కోసం వచ్చిన నామినేషన్లు అందరినీ కలవర పెడుతున్నాయి. ఈ సారి పోటీని కొంత మేరకు అంచనా వేసిన ఆయా పార్టీల ముఖ్య నాయకులు, అభ్యర్థులు.. నామినేషన్ చివరి రోజున తమ సత్తాను చాటేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. భారీ ప్రదర్శనలు, ర్యాలీలు తీసి నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పర్వం ఈ నెల 3 నుంచే మొదలైనా సోమవారమే మాత్రం అత్యధికంగా వేశారు. ఈ ఒక్క రోజే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి 80 మంది అభ్యర్థులు 125 నామినేషన్ సెట్లను వేశారు. అలాగే టీచర్ ఎమ్మెల్సీకి 15 మంది అభ్యర్థులు 22 నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. నిజానికి 3 నుంచే నామినేషన్ల ఘట్టం మొదలు కాగా, ఈ నెల 9 వరకు వచ్చిన నామినేషన్ల సంఖ్య అంతంతే ఉన్నది. దీంతో పోటీ మాములుగానే ఉండొచ్చని భావించినా.. చివరి రోజు ఊహించని విధంగా నామినేషన్లు రావడం ప్రస్తుతం అందరికీ సవాల్‌గా మారింది.

### రాజీకి ప్రయత్నాలు?

అంచనాలకు భిన్నంగా నామినేషన్లు దాఖలు కావడంతో కొంతమంది ప్రధాన అభ్యర్థులు తమకు అనుకూలంగా ఉన్న వారిని విత్‌డ్రా చేయించేందుకు బేరసారాలు మొదలు పెట్టినట్టు విశ్వసనీయ సమాచారం. పేర్లు పోలి ఉన్న అభ్యర్థుల వల్ల తమకు ఇబ్బంది అవుతుందని భావిస్తున్న కొంతమంది పోటీదారులు.. ముందుగా వారితో రాజీకి ప్రయత్నాలు మొదలు పెట్టారు. వివిధ వ్యక్తులు విద్యాసంస్థల నుంచి పోటీ చేస్తుండగా, అన్ని విద్యాసంస్థలు ఒక తాటిపైకి వస్తే బాగుటుందన్న ఉద్దేశంతో కొంతమందిని విత్‌డ్రా చేయించేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం అందుతున్నది. అలాగే గతంలో స్థానిక సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేసిన కొంత మంది నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలోనూ ఒక్కరే బరిలో ఉండి.. ఆ ఒక్కరికి మద్దతివ్వాలన్న ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. ఇండిపెండెంట్‌గా పోటీచేసిన కొంత మంది.. అందరూ ఒకే చోట కూర్చొని ఏదో ఒక నిర్ణయం తీసుకుందామని భావిస్తున్నట్టు కొంతమంది చెబుతున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఈ నెల 13 మధ్యాహ్నం మూడు గంటల వరకు విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశమున్న నేపథ్యంలో ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకొని, వీలైనంత ఎక్కువ మందిని విత్‌డ్రా చేయించే దిశగా అడుగులు వేస్తున్నారు. అంతేకాదు, విత్ డ్రా అయిన వ్యక్తులను తమ వైపు తిప్పుకునేందుకు బేరసారాలకు దిగుతున్నట్టు తెలుస్తున్నది. కొంతమంది అభ్యర్థులు ససేమిరా అంటుండగా.. మరికొంత మంది మాత్రం విత్‌డ్రా చేసుకునేందుకు లొంగుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులంతా బరిలో ఉంటారా..? లేక ఎవరికైనా మద్దతు పలుకుతూ ఉపసంహరించుకుంటారా..? అన్నది 13న పూర్తి క్లారిటీ రానున్నది.

### పెరిగిన ఓటర్లు



2019 ఎన్నికలతో పోలిస్తే ఈ సారి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఓటర్ల సంఖ్య పెరిగింది. అందులో గ్రాడ్యుయేట్ ఓటర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. పట్టభద్రుల స్థానం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేయాలకునే ఔత్సాహిక అభ్యర్థులు ఒకరికొకరు పోటీపడి ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆ కారణంగానే ఈ సారి ఓటర్ల సంఖ్య పెరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. నిజానికి 2019 ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లు 1,96,321 మంది ఉండగా, ఈ సారి తుదిజాబితా ప్రకారం 3,55,159కి చేరింది. అంటే 1,58,830 మంది ఓటర్లు పెరిగారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 2019 ఎన్నికల్లో 23,214 మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 23,214కి చేరింది. అంటే కొత్తగా 3,874 మంది ఓటర్లు పెరిగారు. కాగా, ఈ సారి టీచర్, గ్రాడ్యుయేట్ అభ్యర్థుల గెలుపోటముల విషయంలో కరీంనగర్ జిల్లా కీలకం కానున్నది. అత్యధిక ఓటర్లు నమోదు కావడమే అందుకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. నామినేషన్ల ఘట్టం ముగియడంతో అధికారయంత్రాగం ఎన్నిలకు ఏర్పాట్లు చేస్తున్నది. ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండా ప్రశాంత వాతావారణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కావాల్సిన చర్యలపై దృష్టిపెట్టింది.

**2019 మార్చిలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లాల వారీగా ఓట్ల వివరాలు**

| జిల్లా | పురుషులు | మహిళలు | థర్డ్ జండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 5687 | 2100 | 2 | 7789 |
| జగిత్యాల | 11782 | 5190 | – | 16972 |
| భూపాల్‌పల్లి | 664 | 219 | 1 | 884 |
| కామారెడ్డి | 7492 | 2988 | 1 | 10481 |
| కరీంనగర్ | 23,268 | 12,428 | 7 | 35,703 |
| ఆసిఫాబాద్ | 3,117 | 1,238 | – | 4,355 |
| మంచిర్యాల | 9,670 | 4,308 | 2 | 13,980 |
| మెదక్ | 5,818 | 1,889 | – | 7.707 |
| నిర్మల్ | 8,486 | 3,859 | – | 12,345 |
| నిజామాబాద్ | 17,076 | 8,926 | 6 | 26,008 |
| పెద్దపల్లి | 11,657 | 5,448 | 2 | 17,107 |
| రాజన్నసిరిసిల్ల | 7,390 | 3,192 | 2 | 10,584 |
| సంగారెడ్డి | 9,228 | 3,789 | 1 | 13,018 |
| సిద్దిపేట | 11,110 | 4,316 | 1 | 15,427 |
| హన్మకొండ | 2,773 | 1.187 | 1 | 3,961 |
| మొత్తం | 1,35,218 | 61,077 | 26 | 1,96,321 |

**2019 మార్చిలో జరిగిన ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లాల వారీగా ఓట్ల వివరాలు**

| జిల్లా | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 1129 | 425 | 1554 |
| జగిత్యాల | 1027 | 347 | 1374 |
| జయశంకర్ భూపాలపల్లి | 102 | 41 | 143 |
| కామారెడ్డి | 1338 | 616 | 1954 |
| కరీంనగర్ | 2130 | 1067 | 3197 |
| ఆసిఫాబాద్ | 352 | 141 | 493 |
| మంచిర్యాల | 948 | 488 | 1436 |
| మెదక్ | 768 | 379 | 1147 |
| నిర్మల్ | 1284 | 454 | 1738 |
| నిజామాబాద్ | 1975 | 1049 | 3024 |
| పెద్దపల్లి | 578 | 357 | 935 |
| రాజన్నసిరిసిల్ల | 600 | 183 | 783 |
| సంగారెడ్డి | 1480 | 864 | 2344 |
| సిద్దిపేట | 2061 | 871 | 2932 |
| వరంగల్ అర్బన్ (ప్రస్తుతం హన్మకొండ) | 120 | 40 | 160 |
| మొత్తం | 15,892 | 7322 | 23,214 |


**2025లో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తాజాగా విడుదల చేసిన ఓటర్ల వివరాలు**



**గ్రాడ్యుయేట్స్ ఓటర్లు**

| జిల్లా | పురుషులు | స్త్రీలు | థర్డ్‌జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| ఆసిఫాబాద్ | 4297 | 1840 | – | 6137 |
| మంచిర్యాల | 19041 | 11880 | – | 30921 |
| ఆదిలాబాద్ | 10323 | 4612 | – | 14935 |
| నిర్మల్ | 11497 | 5644 | – | 17141 |
| నిజామాబాద్ | 19993 | 11581 | – | 31574 |
| కామారెడ్డి | 11616 | 4793 | 1 | 16410 |
| జగిత్యాల | 21667 | 13614 | – | 35281 |
| పెద్దపల్లి | 19008 | 12028 | 1 | 31037 |
| కరీంనగర్ | 42806 | 28739 | – | 71545 |
| రాజన్న సిరిసిల్ల | 13772 | 8265 | – | 22397 |
| సంగారెడ్డి | 17383 | 8269 | – | 25652 |
| మెదక్ | 8879 | 3593 | – | 12472 |
| సిద్దిపేట | 21587 | 11002 | – | 32589 |
| హన్మకొండ | 3162 | 1423 | – | 4585 |
| భూపాల్‌పల్లి | 1734 | 749 | – | 2483 |
| మొత్తం | 2,26,765 | 1,28,392 | 2 | 3,55,159 |

**టీచర్స్ ఓటర్లు**



| జిల్లా | పురుషులు | స్త్రీలు | థర్డ్‌జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| ఆసిఫాబాద్ | 325 | 145 | – | 470 |
| మంచిర్యాల | 999 | 665 | – | 1664 |
| ఆదిలాబాద్ | 1095 | 498 | – | 1593 |
| నిర్మల్ | 1282 | 684 | – | 1966 |
| నిజామాబాద్ | 2176 | 1575 | – | 3751 |
| కామారెడ్డి | 1307 | 704 | – | 2011 |
| జగిత్యాల | 1232 | 537 | – | 1769 |
| పెద్దపల్లి | 647 | 464 | – | 1111 |
| కరీంనగర్ | 2663 | 1642 | – | 4305 |
| రాజన్న సిరిసిల్ల | 677 | 273 | – | 950 |
| సంగారెడ్డి | 1520 | 1170 | – | 2690 |
| మెదక్ | 799 | 548 | – | 1347 |
| సిద్దిపేట | 2020 | 1192 | – | 3212 |
| హన్మకొండ | 126 | 40 | – | 166 |
| భూపాల్‌పల్లి | 64 | 19 | – | 83 |
| మొత్తం | 16,932 | 10,156 | - | 27,088 |

## కాంగ్రెస్ పాలన అట్టర్‌ఫ్లాప్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

- ఏడాదిలోనే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత
- ఎమ్మెల్యేలు, మంత్రులు రోడ్లమీద తిరిగే పరిస్థితి లేదు
- స్థానిక సంస్థల ఎన్నికలంటే సీఎంకు భయం పట్టుకుంది
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కు రాజకీయ అవగాహన లేదు
- బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

మానకొండూర్, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అట్టర్ ఫ్లాప్ అయిందని, ఏడాదిలోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని, 420 హామీలు గాలిలో కలిశాయని, ఆ పార్టీపై ప్రజలకు విశ్వాసం పోయిందని మండిపడ్డారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటేనే ముఖ్యమంత్రి భయపడుతున్నారని, జిల్లాల పర్యటన అంటేనే జంకుతున్నారని, ఎమ్మెల్యేలు, మంత్రులు రోడ్లమీద తిరిగే పరిస్థితి లేదని విమర్శించారు. మానకొండూర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్ల సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ బీఆర్‌ఎస్ పార్టీపై చేసిన విమర్శలను ఖండించారు. మహేశ్‌కు రాజకీయాలపై అవగాహన లేదని, రేవంత్‌రెడ్డిని జోకితేనే ఆయనకు పీసీసీ పదవి వచ్చిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మునిగిపోయే నావ అని, గతంలో 19 రాష్ట్రాల్లో అధికారంలో ఉండేదని, ఇప్పుడు మూడు రాష్ట్రాలకే పరిమితమైందన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ లోపాయికారి ఒప్పందంతో ఆప్ పార్టీ ఓటమి చవిచూసిందన్నారు. ఆప్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పామని రేవంత్‌రెడ్డి మాట్లాడడమే అందుకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికల నియామవళిని ఉల్లంఘించారని, దీనిపై కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్వీ నియోజక కన్వీనర్ గుర్రం కిరణ్‌గౌడ్, నాయకులు రామంచ గోపాల్ రెడ్డి, శాతరాజు యాదగిరి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, దండబోయిన శేఖర్, పిట్టల మధు, రాచకట్ల వెంకటస్వామి, గడ్డం సంపత్, ఇస్కుల్ల అంజయ్య, కొండ్ర వెంకటస్వామి పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో ఎగిరేది గులాబీ జెండానే

- కాంగ్రెస్ దొంగ హామీలను ఎండగట్టేది బీఆర్‌స్సే
- పదిహేను నెలల పాలనలో అభివృద్ధి శూన్యం
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, ఫిబ్రవరి 11: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ గులాబీ జెండానే ఎగురుతుందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని ఏ ఒక్క నియోజకవర్గం కూడా అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, ఆ పార్టీ దొంగ హామీలను ప్రజల్లో ఎండగట్టేది బీఆర్‌ఎస్సేనని స్పష్టం చేశారు. చొప్పదండిలోని ఎస్‌ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం మండలంలోని బీఆర్‌ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని వివరిస్తూనే కాంగ్రెస్ తీరును ఎండగట్టారు. రేవంత్‌రెడ్డి మోసపూరిత హామీలతో గద్దెనెక్కారని, ఆయన పదిహేను నెలల పాలనలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. గ్రామాల్లో ఎవరిని కదిలించినా తిడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలోనే రాష్ట్ర అభివృద్ధి జరిగిందని, అది కేసీఆర్‌తోనే సాధ్యమైందని గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గడపగడపకూ వివరించాలని, కాంగ్రెస్ అబద్ధపు హామీలను ఎండగట్టాలని శ్రేణులకు సూచించారు. బీఆర్‌ఎస్ నాయకులంతా సమన్వయంతో పనిచేయాలని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అవకాశం రాలేదని ఎవరూ బాధపడొద్దని, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచుల ఎన్నికలు ఉన్నందున అవకాశాలు అందరికీ వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, ఆర్నకొండ సింగిల్‌విండో చైర్మన్ మినుపాల తిరుపతిరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఆరెల్లి చంద్ర శేఖర్‌గౌడ్, గడ్డం చుక్కారెడ్డి, మాజీ వైస్ చైర్మన్లు కొత్త గంగారెడ్డి, చీకట్ల రాజశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యాక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు మాచర్ల వినయ్, బందారపు అజేయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్

## ఆ పార్టీని ప్రజలే బొందపెడ్తరు

- చార్ సౌ బీస్ హామీలతో రేవంత్ సీఎం అయ్యిండు
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును తిట్టడమే పనిగా పెట్టుకున్నడు
- కాంగ్రెస్ పాలనపై బీఆర్‌ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ధ్వజం

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 11 : అమలుగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలే త్వరలో బొంద పెడతారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య హెచ్చరించారు. చార్ సౌ బీస్ హామీలతో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును తిట్టడమే రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. సిరిసిల్లలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి అన్నదమ్ములు, కుటుంబ ప్రయోజనంపై ఉన్న శ్రద్ధ ప్రజా సంక్షేమంపై లేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో చేసిన సర్వేకు సంబంధించిన సంపూర్ణ వివరాలతో సమగ్ర కుటుంబ జాబితాను ఆన్‌లైన్‌లో పెట్టారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి చేసిన కులగణన సర్వేతో సామాజికవర్గాలకు తాకులాటలు పెట్టించారని విమర్శించారు. పదేండ్లలో కనీసం 3 శాతం పెరగాల్సిన బీసీ జనాభాను కావాలనే తగ్గించి చూపారని, తన సామాజికర్గమైన అగ్రవర్ణాల జనాభాను పెరిగినట్టు చూపారని ఆరోపించారు. స్థానిక సంస్థల్లో లాభపడాలన్న ఉద్దేశంతోనే ఈ మోసానికి కుట్ర లేపారని ధ్వజమెత్తారు. తెలంగాణపై నిత్యం విషం చిమ్మే మీడియా సంస్థల ద్వారా సామాజికవర్గాల మధ్య కొట్లాటలు పెట్టించారని మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పిన విధంగా 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేవరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ దేశంలో అంతరించిపోతున్న పార్టీ అని ఎద్దేవా చేశారు. వట్టిపోయి, వాడిపోయిన కూరగాయల్లాగా అధికారంలోకి వచ్చిన నాయకులు సైతం బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యమ కాలంలో తాము అన్ని రకాల ఆటుపోట్లను ఎదుర్కొన్నామని చెప్పారు. కేకే మహేందర్‌రెడ్డికి ఉద్యమ ప్రస్థానమే తెలియదని, ఓ అధికారిని అడ్డుపెట్టుకొని బీఆర్‌ఎస్ నాయకులను ఇబ్బంది పెట్టినంత మాత్రాన బీఆర్‌ఎస్‌ను నష్టపరుస్తున్నామని అనుకుంటే వారి భ్రమేనని చెప్పారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అనేక మంది కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ వద్దకు వచ్చి పనుల్లో సాయం తీసుకున్నారని, ఇప్పుడు కాంగ్రెస్ నేతలు అధికారంలోకి రాగానే అహంకారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ, బీసీలకు ప్రధాన శత్రువు కాంగ్రెస్ అని, ఆ పార్టీ బీసీలను ఎప్పుడూ ఓటు బ్యాంకుగానే చూసిందని విమర్శించారు. కేంద్రంలో నాటి నుంచి అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లుకు ఆమోదం తెలుపలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు బీసీలపై చిత్త శుద్ధి లేదన్నారు. అన్ని రంగాలలో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత కేసీఆర్, కేటీఆర్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. బీసీల అభ్యున్నతికి పాటుపడింది బీఆర్‌ఎస్ మాత్రమేనని కొనియాడారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గజభీంకార్ రాజన్న, బండ నర్సయ్య యాదవ్, కోడి అంతయ్య, ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, పడిగెల రాజు, దిడ్డి రాజు, కొమిరిశెట్టి లక్ష్మణ్, పాపగారి వెంకటస్వామిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.